క్లుప్తంగా

వైఎస్సార్ బీమా నగదు అందజేత



కర్లపాలెం: కర్లపాలెం గ్రామానికి చెందిన కర్రి సుందర్ సింగ్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందటంతో మట్టి ఖర్చుల నిమిత్తం.. వైఎస్సార్ బీమా నగదు రూ.10వేలు శుక్రవారం అతని భార్య అమలకుమారికి సర్పంచ్ నక్కా లలితకుమారి అందజేశారు. మిగతా రూ.90వేలు త్వరలో అధికారులు అందజేస్తారని ఆమె తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ అమీర్‌బేగ్, ఎంపీడీవోఎలీషాబాబు, ఉప సర్పంచ్ పఠాన్ అహ్మద్ బాషా, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం 42వ హరిద్ర శృంగార్చన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ.. ఆలయంలో ప్రతి శుక్రవారం వివాహం కాని మగ పిల్లలకు శీఘ్రంగా వివాహం జరగాలని ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాల లీజ్‌కు టెండర్లు

తెనాలిఅర్బన్: తెనాలి బస్టాండ్ పరిధిలోని పలు ఖాళీ స్థలాలను 15 సంవత్సరాలు అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు పిలవడం జరిగిందని డిపో మేనేజర్ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 2వ తేదీ లోపు నెల్లూరులోని ఆర్‌ఎం ఆఫీస్‌లో దాఖలు చేయాలని చెప్పారు. 3న నెల్లూరులోని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో టెండర్లు తీయడం జరుగుతుందన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: దాడి ఘటనపై శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ముత్తెంశెట్టిపాలేనికి చెందిన సుబ్బారావుపై పోతురాజు కాలనీకి చెందిన ప్రశాంత్, నాగూర్, అయ్యప్ప స్వల్ప విషయమై ఘర్షణ పడి, దాడి చేశారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాలి పటాలు.. ఖాళీ ప్రదేశాల్లో ఎగరేయాలి

తెనాలిటౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా యువకులు, చిన్నారులు గాలి పటాలను ఖాళీ ప్రదేశాల్లో మాత్రమే ఎగురవేసుకోవాలని ఏపీసీపీ డీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీవీ చిరంజీవి సూచించారు. చెంచుపేటలోని డివిజనల్ విద్యుత్‌శాఖ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న ప్రదేశాల్లో గాలి పటాలను ఎగురవేయవద్దని కోరారు. బిల్డింగ్‌లపై ఉండి గాలి పటాలను పిల్లలు ఎగురవేసేటప్పుడు పెద్దలు పక్కన తప్పని సరిగా ఉండాలని, విద్యుత్ తీగలకు తగలకుండా గాలి పటాలను ఎగుర వేసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలకు గాలిపటం చుట్టుకున్నట్లయితే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, ఇది గమనించాలని ఈఈ కోరారు.

మొక్కజొన్న పంట పరిశీలన



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులో మొక్కజొన్న పంట పొలాలను శుక్రవారం వ్యవసాయ శాస్త్రవేత్త, ఆత్మ అధికారులు పరిశీలించారు. వ్యవసాయ శాస్త్రవేత్త జీఎస్‌వీ ప్రసాద్, ఆత్మ డీడీఏ పి.రామాంజనేయులు, ఏడీఏ జి.ప్రవీణ, వ్యవసాయాధికారులు మొక్కజొన్న, జొన్న పంట పొలాలను సందర్శించారు. మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. ప్రస్తుతం మొక్కజొన్న 25రోజుల దశలో ఉందని, ఈ దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. కొలకలూరు ఆర్‌బీకే పరిధిలో 450 ఎకరాల్లో మొక్కజొన్న, 200 ఎకరాల్లో జొన్న, మూడు వేలకు పైగా ఎకరాల్లో పెసర సాగు చేస్తున్నట్లు గ్రామ వ్యవసాయ సహాయకులు తెలిపారు. వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్, వీఏఏలు నాగరాజు, వంశీ, నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.

సంక్రాంతి వచ్చేసింది..

- పల్లెలను తాకిన సంక్రాంతి సందడి
- భోగి వెలుగులతో సంబరాలు
- ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న మహిళల ముగ్గుల పోటీలు



భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో నిర్వహించిన పోటీలలో తీర్చిదిద్దిన ముగ్గులు

భట్టిప్రోలు: పెద్ద పండుగ సంక్రాంతి వచ్చేసింది. పండుగ సంబరాలు అన్ని గ్రామాల్లో మొదలయ్యాయి. సంక్రాంతిని పురస్కరించుకుని వెల్లటూరు వాసవిక్లబ్, సంతూర్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సిద్ధిబుద్ధి సమేత గణపతి స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గుర్రం కృష్ణకుమార్తి, డి.శివపార్వతి, టి.చంద్రావతి కైవశం చేసుకున్నారు. కార్యక్రమంలలో క్లబ్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నంబూరు తేజ, వాసవి క్లబ్ అధ్యక్షులు నాగళ్ల ఆంజనేయులు, కార్యదర్శి నంబూరు పవన్, కోశాధికారి నంబూరు ప్రసాద్, నిర్వాహకులు అన్నవరపు వెంకటేశ్వరరావు, ఎస్.మధు, ఎస్. ప్రసాద్, సంతూర్ కంపెని ప్రతినిధులు ఒ. కోటేశ్వరరావు, నారాయణ, బాలాజీలు పాల్గొన్నారు. పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతి అందించారు. న్యాయ నిర్ణేతలుగా బూర్లె అరుణ కుమారి, ఒ.కోటేశ్వరరావు వ్యవహరించారు.

పల్లెకోనలో ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

భట్టిప్రోలు మండలం పల్లెకోనలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.5వేలు, రూ.3 వేలు, రూ. 2 వేలు నగదు అందజేశారు. అలాగే పాల్గొన్న ప్రతి మహిళలకు రూ.600ల విలువ చేసే చీరలను బహుమతులుగా అందచేశారు. న్యాయ నిర్ణేతలుగా ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరిలు వ్యవహరించారు. కార్యక్రమాన్ని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శేరు శ్రీనివాసరావు పర్యవేక్షించారు. సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ, సూరేపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు గోవర్ధనగిరి చినబుజ్జి, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. మండలంలోని సూరేపల్లిలో కూడా శుక్రవారం వ్యవసాయ సాగు ఉత్పత్తుల సంస్థ (ఎఫ్‌ఎంసీ) కంపెనీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎఫ్‌ఎంసీ సంస్థ ఆర్‌ఎస్‌ఎం కె.శ్రీనివాసనాయక్, ఎస్‌వో చిరంజీవి, ఎంఐవో సంగమేశ్వరరావు, ఆర్‌సీ డీలర్లు బహుమతులు అందచేశారు.

15న ముగ్గుల పోటీలు

రేపల్లె: పట్టణంలోని పెద కూరగాయల మార్కెట్ వెనుక ఈ నెల 15న ఆదివారం మధ్యాహ్నం మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు నృత్య ప్రదర్శన పోటీలు పట్టణ ఆదర్శక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వేదిక అధ్యక్షుడు వై.కిషోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళలు, చిన్నారులు పోటీలలో పాల్గొనాలని కోరారు. పూర్తి వివరాలకు 93471 59811 నంబరును సంప్రదించాలన్నారు.



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు



పల్లెకోనలో రంగవల్లులను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, న్యాయ నిర్ణేతలు

ప్రభుత్వ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకం

– ఎమ్మెల్యే కోన రఘుపతి



క్యాలెండర్ ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయేందుకు ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ క్యాలెండర్‌ను తన నివాసంలో ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ.. ఉద్యోగులు ప్రజా సమస్యల పరిష్కారానికి ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు సత్యంరాజు కూరపాటి, డాక్టర్ పవన్ చైతన్య, ఇంటూరి ఝాన్సీ రాణి, మేకల సుశీలరావు, ఆశ కార్యకర్తలు తాడిశెట్టి స్వాతి, పోతన దుర్గా భవాని పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

బాపట్ల జిల్లా అసోసియేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. ప్రధాన సలహాదారులుగా ఎన్‌వీకే ప్రసాద్, గౌరవ అధ్యక్షుడిగా టి.రవికుమార్, అధ్యక్షుడిగా కూరపాటి సత్యంరాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా వలివేటి వెంకటసురేంద్ర, ప్రధాన కార్యదర్శిగా బడుగు శివాజీ, కోశాధికారిగా ఎన్.పుల్లారావును ఎన్నుకున్నారు.

మతం ఏదైనా భావం ఒక్కటే..

బాపట్ల అర్బన్: మతం ఏదైనా భావం ఒక్కటిగా.. సమాజాభివృద్ధికి దోహదపడాలని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. బాపట్లలోని వైఎస్సార్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన న్యూ కవనెంట్ చర్చిని ఆయన ప్రారంభించారు. పాస్టర్ సీహెచ్ డేవిడ్ వ్యవస్థాపకులుగా ప్రత్యేక ప్రార్థన అందించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ మతాలకు అతీతంగా బాపట్ల ప్రాంతాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అన్ని వసతులతో చర్చిని నిర్మించిన డేవిడ్ ఫాస్టర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాగిత యజ్ఞయ్య, సంపతమ్మ, యాకోబు, రమేష్, పాస్టర్స్ పాల్గొన్నారు.

నేడు శ్రీదండి పార్వతి అమ్మవారి గ్రామోత్సవం



శ్రీ దండిపార్వతి అమ్మవారు

భట్టిప్రోలు: సంక్రాంతి పురస్కరించుకొని భట్టిప్రోలు గ్రామదేవత శ్రీ దండి పార్వతి అమ్మవారికి శనివారం పుర వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు యాదవ సంఘం నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, టెంకాయలు, పండ్లు, పూలు సమర్పించి తమ భక్తి ప్రపత్తులు చాటుకోవాలని తెలిపారు. మేళ తాళాలు, కనక తప్పెట్ల మధ్య అమ్మవారి గ్రామోత్సవం కొనసాగుతుందని పేర్కొన్నారు.

నేడు శ్రీ గోదా రంగనాథ స్వామి కల్యాణం



వేణుగోపాలస్వామి

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం శ్రీ గోదా రంగనాథస్వామి వారి కల్యాణ మహోత్సవం జరుగుతుందని దేవాలయ కార్యనిర్వాహణాధికారి దీవి వెంకట అప్పలాచార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. యాజ్ఞికులు వినుకొండ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అర్చకులు అగ్నిహోత్రం శ్రీనివాస్ సహకారంతో ఈ మహోత్సవం జరుగుతుందని తెలిపారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: శివాజీ చౌక్‌లోని శ్రీ కాళీమాత ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు గుమ్మడి రమేష్, వెంకట్రావు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం దేవస్థానం వద్ద అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కందెపు సీతారామయ్య, నక్కా వెంకటేశ్వర్లు, డాకా అంకిరెడ్డి, ఉమ్మల వెంకటేశ్వర్లు, వై.శివాజీ, అడపాల నాగేశ్వరరావు, ఎన్.గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కుటుంబాలకు అండగా ఉంటాం

- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్
- మృతుల కుటుంబ సభ్యులకు నగదు చెక్కులు అందజేత



పోలీసు కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్ : పోలీస్ కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. అనారోగ్యంతో మృతి చెందిన పోలీస్ సిబ్బంది కుటుంబ సభ్యులకు ఫ్లాగ్ ఫండ్, విడో ఫండ్ చెక్కులను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు. చీరాల 1టౌన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఏడుకొండలు, కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతిచెందిన డి.అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులకు చెక్‌లను అందజేశారు. ఎస్పీ పోలీస్ కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను, వారి పిల్లల చదువల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బంది మరణించడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఏదైనా సమస్య వచ్చిన, ఏ సాయం కావాలన్నా తక్షణమే స్పందించి సహాయం అందించడానికి పోలీస్ శాఖ సంసిద్ధంగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తామన్నారు.

ప్రభుత్వ వైద్యశాలపై నమ్మకం పెరిగింది



పండ్లు, రొట్టెలను అందిస్తున్న సంఘం సభ్యులు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు సకాలంలో అందించి, సేవాదృక్పథాన్ని వైద్యులు చాటుకున్నారని చందోలు గ్రామాభ్యుదయ కమిటీ అధ్యక్షులు, వైద్యశాల స్థలదాత ముస్తఫా బేగ్ పేర్కొన్నారు. పీహెచ్‌సీలో ఓ బాలింతకు పండ్లు, రొట్టెలు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓ గర్భిణి ప్రసవ వేదనతో వైద్యశాలకు రాత్రి 3 గంటల సమయంలో వచ్చిందని తెలిపారు. వెంటనే స్పందించి సాధారణ కాన్పు చేయించిన వైద్యులను, వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ట్రెజరర్ మస్తాన్‌బేగ్, రియాజ్, డాక్టర్ లీలా క్రాంత్ కర్మల్, కె.నాగేశ్వరరావు ,సాంబయ్య, రూతమ్మ, వైద్యసిబ్బంది ఉన్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి, పక్కన జడ్పీటీసీ , ఎంపీడీవో, ఏఓ

భట్టిప్రోలు: ఆర్బీకే ద్వారా రైతులకు సత్వర సేవలు అందించాలని సిబ్బందికి ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి సూచించారు. మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ మీరయ్య అధ్యక్షతన జరిగింది. ఎంపీపీ లలిత కుమారి పాల్గొని, మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించాలని కోరారు. ఏఓ గొల్లపోతు మీరయ్య మాట్లాడుతూ.. రబీ సీజన్‌కు సంబంధించి అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పంట నమోదు కార్యక్రమం మొదలైందని, పీఎం కిసాన్, ఈకేవైసీ చేయించుకోని వారి కోసం ప్రభుత్వం ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, పశు వైద్యులు డాక్టర్ బి.లక్ష్మి రంజిత, వ్యవసాయ సలహా మండలి సభ్యులు సీహెచ్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్య రక్షణతో అధిక దిగుబడులు



రైతులకు పలు సూచనలిస్తున్న తెనాలి ఏడీఏ వెంకటరావు

మున్నంగి(కొల్లిపర): సమగ్ర సస్య రక్షణతో అధిక దిగుబడులు సాధ్యమని తెనాలి ఏడీఏ కె.వెంకటరావు సూచించారు. శుక్రవారం మండలంలోని మున్నంగి గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. జొన్న, మొక్కజొన్న పంటలలో విత్తన శుద్ధి, మేలైన యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ పంటకైన మోతాదుకు మించి ఎరువులు వాడకూడదన్నారు. పంటలో సస్యరక్షణకు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. జొన్న , మొక్కజొన్న పంటలకు ఆశించే చీడపీడలు, వాటి నివారణకు వాడాల్సిన మందులు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు



మౌలిక వసతుల గురించి వివరిస్తున్న తహసీల్దార్

కొల్లిపర: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మించుకునే లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్, నీటి వసతి కల్పిస్తున్నామని తహసీల్దారు జి.నాంచారయ్య, హౌసింగ్ ఏఈ సుబ్బారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లలకు ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ సుబ్బారావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మించుకొనే లబ్ధిదారులకు గ్రామస్థాయి అధికారులు స్వయంగా వెళ్లి.. నిర్మాణానికి ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు, పావలా వడ్డీ రుణాల గురించి వివరించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సమత వాణి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ఏఎస్‌ఎన్ కళాశాలకు రోలింగ్ ట్రోఫీ

క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే శివకుమార్



క్రీడాకారులతో ఎమ్మెల్యే శివకుమార్, ప్రిన్సిపల్ రామ్‌చంద్

తెనాలిఅర్బన్: అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఏఎస్‌ఎన్ డిగ్రీ కళాశాల క్రీడాకారులు పతకాలు సాధించారు. ఓవర్ ఆల్ చాంపియన్ షిప్, వరుసగా 13వ సారి రోలింగ్ ట్రోఫీని సాధించినట్లు ఏఎస్‌ఎన్ విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. కళాశాలలో పతకాలు సాధించిన క్రీడాకారులను శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాగార్జున యూనివర్శిటీలో ఈ నెల 12న పోటీలు జరిగినట్లు చెప్పారు. ప్రిన్సిపల్ కొలసారి రామ్‌చంద్ మాట్లాడుతూ వెయిట్ లిఫ్టింగ్‌లో ఆకటి రాజా 185కిలోల విభాగంలో రజతం, ముద్దా తిరుపతిరావు 203 కిలోల విభాగంలో బంగారం, షేక్ రషీద్ 140 కిలోల విభాగం రజత పతకాలు సాధించినట్లు చెప్పారు. రాగాల వరుణ్ 282కిలోలు, గండికోట సందీప్ కుమార్ 120 కిలోల విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. అంబళ్ల కోమల కార్తీక్ 225 విభాగంలో, పాలేరు భార్గవ్‌కుమార్ 160 కిలోల విభాగంలో రజత పతకాలు సాధించారన్నారు. కాలేజ్ లిఫ్టర్లు అద్భుత ప్రతిభను కనబరచి ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించడంతో పాటు రాగాల అరుణ్ బెస్ట్ లిఫ్టర్ టైటిల్‌ను సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకుడు నల్లక శేషగిరిరావు పాల్గొన్నారు.

దుర్గా ప్రసాద్ సేవలు మరువ లేనివి



తెనాలిఅర్బన్: కళాకారుల అభ్యున్నతికి నాగళ్ళ దుర్గాప్రసాద్ చేసిన కృషి మరువరానిదని శ్రీ విజయలక్ష్మి శ్రీనివాస నాట్యమండలి నిర్వాహకులు దీపాల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం మాజీ అధ్యక్షుడు నాగళ్ళ దుర్గాప్రసాద్ ద్వితీయ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉప్పుబజార్‌లోని సంస్థ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. రంగస్థల కళాకారులు ఆలపాటి వెంకటేశ్వరరావు, బెజ్జంకి నాగమణి, పాతూరి సుబ్రహ్మణ్యం, దీపాల సత్యనారాయణ, చెన్నం సుబ్బారావు, కఠారి కొండలరావు, కె.విజయసారథి బాబు, తదితరులు పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్ మరణం తీరని లోటు

తెనాలిటౌన్: తెనాలి ప్రాంతంలో కళాకారులు, సాహిత్య ప్రియులకు దుర్గాప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని, ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటు అని పలువురు కళాకారులు పేర్కొన్నారు. ప్రజ్వలిత ఆధ్వర్యంలో గాంధీ నగర్‌లోని కవిరాజా పార్కులో శుక్రవారం ప్రజ్వలిత వ్యవస్థాక అధ్యక్షుడు నాగళ్ళ వెంకట దుర్గాప్రసాద్ ద్వితీయ వర్ధంతి సభను జరిపారు. ఆయన చిత్రపటానికి పలువురు కళాకారులు, ప్రముఖులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కనపర్తి బాబురావు మాట్లాడుతూ ఎందరో కవులు, కళాకారులకు జీవిత సాఫల్య పురస్కారాలను అందజేసిన ఘనత దుర్గా ప్రసాద్‌కు దక్కుతుందన్నారు. డీఎల్ కాంతారావు, మహాత్మ ఆశ్రమ వ్యవస్థాపకులు వజ్రాల రామలింగాచారి, ఎం.రామలింగేశ్వరరావు, దేవిశెట్టి కృష్ణారావు, కొండమూడి రమేష్, కనపర్తి అబ్రహం లింకన్, బెన్‌హర్, గరికపాటి సుబ్బారావు, కన్నెగంటి మధు, అలపర్తి వెంకటేశ్వరరావు, రాజు, సుభాష్‌చంద్రబోస్, నన్నపనేని రాంబాబు, అచంటి శ్రీనివాసరావు, కనపర్తి డేవిడ్, వాలిగ వెంకటేశ్వరరావు, వెనిగళ్ళ ప్రసాద్, ఎ.యోహాన్, డి.పూర్ణచంద్రరావు, సీతారామయ్య, పలువురు కళాకారులుపాల్గొన్నారు.

సంప్రదాయాల కొనసాగింపు అభినందనీయం

ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత

గుంటూరు లీగల్: సంక్రాంతి పండగ సందర్భంగా సంప్రదాయాల్ని కొనసాగిస్తూ ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత అన్నారు. సంక్రాంతి పండగ సందర్భంగా గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళా న్యాయవాదులకు శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎ.అనిత, రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఎం.వెంకటేశేషమ్మ, నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఎ.సునీత, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోరంట్ల స్వాతి, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జోష్నశ్రీ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. న్యాయమూర్తులు అన్ని ముగ్గులను పరిశీలించి విజేతల్ని ప్రకటించారు. మొత్తం ఎనిమిది మంది పాల్గొన్నారు. పాటిబండ్ల ఇంద్రజకు మొదటి బహుమతి, నాగకమల, ప్రత్యూషకు రెండో బహుమతుల్ని అందజేశారు. మిగిలిన వారికి కూడా ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. జీబీఏ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ వి.జయపాల్, లేడీ రిప్రజెంటేటివ్ ఎం.నాగలక్ష్మి, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సిద్ధ సత్యనారాయణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ టి.వెంకట ఆనందరావు పాల్గొన్నారు.